
ప్రజాశక్తి
బుధవారం 19 ఫిబ్రవరి 2025
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





డ్రోన్ సర్వేతో ఉపయోగాలు



నెల్లూరు : డ్రోన్ సాంకేతిక విధానం ద్వారా నగర పాలక సంస్థ పరిధిలో నిర్వహిస్తున్న సర్వే ద్వారా ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని, అధికారులు, ప్రజాప్రతినిధుల అందరి సహకారంతో ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేద్దామని నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పిలుపు నిచ్చారు. భారత ప్రభుత్వం నేషనల్ జియోస్పేషియల్ నాలెడ్జ్ - బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హాబిటేషన్స్ (నక్ష) కార్యక్రమం అధికారిక ప్రారంభోత్సవాన్ని నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి హాజరయ్యారు. నగర పాలక సంస్థ కమిషనర్ సూర్య తేజ తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం డ్రోన్ సర్వే పనితీరును సాంకేతిక విభాగం బృందాన్ని అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ సూర్య తేజ మాట్లాడారు. అదనపు కమిషనర్ వై.ఓ. నందన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ తహసీన్, కో ఆప్షన్ సభ్యులు, కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు ఉన్నారు.

ఉదయగిరి తమ్ముళ్లు బరితెగింపు

వైసిపి ప్రభుత్వం అవినీతి, అక్రమాలు, దాడులకు పాల్పడుతోందని గతంలో గగ్గోలు పెట్టిన టిడిపి నేతలు, ఇప్పుడు అంతకు మించి అవినీతి, అక్రమాలకు, దాడుల సంస్కృతికి తెరతీశారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన రెవెన్యూ, పోలీసు అధికారులు అధికారపార్టీ నేతలకు సలాం కొడుతూ, గులాం చేస్తున్నారనే విమర్శలున్నాయి.. అందుకు బలం చేకూర్చేలా ఉదయగిరి నియోజకవర్గంలో అధికారులు వ్యవహరిస్తున్నారు. ఉదయగిరి నియోజకవర్గం కనియంపాడు ,చుట్టుపక్కల గ్రామాల్లో అగ్రిగోల్డ్ ఆస్తులున్నాయి. మంగళవారం అగ్రిగోల్డ్ బాధితులు తమ ఆస్తులు కాపాడాలని కోరుతూ వరికుంటపాడు, కనియంపాడు గ్రామాల్లో పర్యటించారు. ఈ సమయంలో అధికారపార్టీ నేతలు, కార్యకర్తలు వాహనాలు అడ్డగించి దాడికి దిగారు. దీనిని చిత్రీకరించిన వీడియోలను ఎస్ఐ స్వామి భక్తితో దగ్గరుండి తొలగించినట్లు తెలిసింది. తహశీల్దారు బాధితుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తు, ఏం చేస్తారో చేసుకోండి అంటూ సమాధానం చెప్పినట్లు సమాచారం. ఉదయగిరి ప్రాంతంలోని టిడిపి నేతలకు పోలీసు, రెవెన్యూ, అధికారులు ఊడిగం చేస్తున్నట్లు విమర్శలున్నాయి. ఈ ప్రాంతంలో అధికారపార్టీ నేతల తీరుపై జనం దుమ్మెత్తిపోస్తున్నారు.

- ◆అగ్రిగోల్డ్ బాధితులపై దాడి
- ◆కరిగిపోతోన్న అగ్రిగోల్డ్ ఆస్తులు
- ◆పోలీసు, రెవెన్యూ అధికారులు కుమ్మక్కు

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

వైసిపి ప్రభుత్వం గతంలో ప్రజలు, సాధారణ జనం పట్ల వ్యవహరించిన తీరుతో ఎన్నికల్లో ఊహించని చావు దెబ్బతిన్న విషయం తెలిసిందే. ఇప్పుడు అదే బాటలో టిడిపి నేతలు ముందుకు పోతున్నారు. వైసిపి నుంచి నేతలతో కలిసి, ఇద్దరు సంపద సృష్టించే పనిలో బిజీబిజీగా ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రావెల్, మైనింగ్, ఇసుక, సిలికా, మట్టి, ఒక్కటేమిటి ఏది దొరికితే దాని నుంచి సంపద సృష్టించి జేబులు నింపుకుంటున్నారు. ఈ విషయాలను అధిష్టానికి తెలిసినా మౌనంగా ఉండటంతో స్థానిక నేతలు మరింత రెచ్చిపోతున్నారు. 15 ఏళ్ల కిందట అగ్రిగోల్డ్ సంస్థ రాష్ట్రవ్యాప్తంగా పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలకు మోసం చేసి కోట్ల రూపాయాలు కొల్లకొట్టింది. అప్పట్లో జిల్లా వ్యాపితంగా సుమారు 200 కోట్లు పేద, మధ్య తరగతి జనం నుంచి వసూళ్లు చేశారు. ఆ మొత్తంలో కొంత ఖర్చుపెట్టి చిన్న చిన్న వ్యాపారాలు మొదలు పెట్టారు. అందులో భాగంగానే జిల్లా వ్యాపితంగా జామాయిల్ (యూకలిప్టస్) మొక్కలు నాటారు. ఒక్క ఉదయగిరి నియోజకవర్గంలోనే రెండు వేల ఎకరాల వరకు కొనుగోలు చేసినట్లు సమాచారం. అందులో వచ్చే ఆదాయం లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని ప్రకటించారు. అప్పట్లో "అగ్రిగోల్డ్ బోర్డు తిప్పేస్తుంది" అని నెల్లూరు నుంచే ప్రజాశక్తిలో తొలిత కథనం ప్రచురించింది. దీనిని అగ్రిగోల్డ్ సంస్థ కొందరు కావలి విలేకరులను పంపించి బెదిరింపులకు పాల్పడింది. చిన్నగా అగ్రిగోల్డ్ మోసం బయటపడిన విషయం తెలిసిందే. తాజాగా ఉదయగిరి ప్రాంతంలో "తెలుగు తమ్ముళ్ల కన్ను అగ్రిగోల్డ్ ఆస్తులపై" పేరుతో కథనాలు ప్రచురించిన విషయం తెలిసిందే.

'కరిగిపోతోన్న అగ్రిగోల్డ్ ఆస్తులు'

ఉదయగిరి నియోజకవర్గం వరికుంటపాడు మండలం కనియంపాడు అగ్రిగోల్డ్ భూముల్లో జామాయిల్ సాగుచేశారు. దాదాపు 250 ఎకరాల్లో సుమారు రూ 20 నుంచి 30 కోట్లు ఆస్తి ఉంది. దీనిని టిడిపి నేతలు కొంత కాలంలో నరికి తరలిస్తున్నారు. స్థానిక నేతల పోత్సహంతో తంతుసాగుతుందనే విమర్శలున్నాయి. ఆస్తులు సిబిఐకి ఎప్పుడో అటాచ్ చేశారు. ఇక్కడ పనిచేసే రెవెన్యూ, పోలీసు అధికారులు, అధికారపార్టీ నేతలతో కుమ్మక్కయ్యారనే విమర్శలున్నాయి. రోజు లారీల్లో జామాయిల్ వెళుతున్నా కన్నెత్తి చూడడం లేదు. ఇక్కడ పనిచేసే తహశీల్దారికి ఎవరైనా ఫిర్యాదు చేస్తే "ఏమో నాకు తెలియదు..నాకు సంబంధం లేదు" అనే రెండు వాక్యాలతో కాలం గడిపేస్తున్నారు. ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న ఈ భూముల పరిరక్షించాల్సిన బాధ్యత రెవెన్యూ, పోలీసు అధికారులకు ఉంది. ఇక్కడ అధికారులు ఉన్నతాధికారులను మాయ చేస్తున్నారనే విమర్శలున్నాయి. కళ్ల ముందు సరుకు వెళుతున్నా కళ్లకు గంతలు కట్టుకున్నారు. అధికారపార్టీ నేతల అమ్మాం, అమ్మాములకు అలవాటు పడిన కొందరు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు మీడియాలో వచ్చినా తమకు ఏమీ పట్టనట్లు టిడిపి నేతలు, అధికారులు వ్యవహరిస్తున్నారు. కొద్ది రోజుల్లో మొత్తం సరుకు తరలించడానికి సిద్ధమయ్యారు. ఉదయగిరి ప్రాంతంలో టిడిపి నేతల అవినీతి గురించి కథలు కథలుగా చెప్పుకుంటున్నారు. నీతి, నిజాయితీ, నిబద్ధతతో పనిచేస్తామని అధికారంలోకి వచ్చిన నాయకులు అంతా ఉత్తర్వే అంటూ తమ పని తాము చేసుకుపోతున్నారు.



బాధితులపై దాడికి పాల్పడుతోన్న టిడిపి నేతలు

'అగ్రిగోల్డ్' బాధితులపై దాడి

వరికుంటపాడు గ్రామంలో ఉన్న అగ్రిగోల్డ్ ఆస్తులకు కాపాడాలని మంగళవారం సిపిఐ నాయకులు ముప్పాల నాగేశ్వరావు, దామా అంకయ్య తో కలిసి నెల్లూరు, ప్రకాశం నుంచి పెద్ద ఎత్తున కనియంపాడు వెళ్లారు. అక్కడ భూములు పరిశీలించారు. వరికుంటపాడు వచ్చి తహశీల్దారుకు వినతి పత్రం అందజేశారు. ఆయన నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో బాధితులు అక్కడే ధర్నా చేశారు. అనంతరం పోలీసు స్టేషన్ కు వెళ్లి ఫిర్యాదు చేశారు. అనంతరం తిరిగి నెల్లూరు వస్తుండగా విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు, కొందరు గుండాలతో కార్లను వెంబడించారు. రోడ్డుకు అడ్డంపెట్టారు. "ఏం రా గ్రామంతో జామాయిల్ కొట్టేస్తున్నారా. మా నాయకుడినే గుర్తుకు వచ్చారా. నా కొ... ఏం పీకుతారా... మా నాయకుడినే విమర్శిస్తారా చంపేస్తాం.." అంటూ దాడికి పాల్పడ్డారు. కొందరు చొక్కాలు చిరిగిపోయాయి. అప్పుడే అక్కడకువచ్చిన ఎస్‌ఐ సర్దుబాటు చేసి , టిడిపి నేతలను అక్కడ నుంచి పంపేశారు. కొందరు మీడియా ప్రతినిధులు దీనిని చిత్రీకరించారు. ఎస్‌ఐ వారి వద్దకు వెళ్లి అందరి సెల్‌ఫోన్‌లో రికార్డు అయిన దాడి వీడియోలను తొలగించినట్లు తెలిసింది. దాడికి పాల్పడిన నాయకులను అక్కడ నుంచి మర్యాదగా సాగనంపారు. తమ భూములు కాపాడాలని అధికారుల వద్దకు వెళ్లిన బాధితులు అవాక్కాయ్యారు. టిడిపి నాయకుల బరితెగింపుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని సిఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లడానికి సిపిఐ నాయకులు సిద్ధమైనట్లు తెలిసింది. ప్రశ్నించి, మాట్లాడే వ్యక్తులపై దాడులకు పాల్పడే సంస్కృతిని టిడిపి నేతలు కొనసాగించడం పట్ల బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు..



వరికుంటపాడు తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న బాధితులు, సిపిఐ

సిపిఐ నాయకులపై దాడి హేయం : సిపిఎం

ప్రజాశక్తి-నెల్లూరు

వరికుంటపాడు మండల కేంద్రంలో అగ్రిగోల్డ్ భూముల్లోని జామాయిల్ చెట్లను దొంగతనంగా నరుక్కుని పోయిన విషయమై తహశీల్దారుకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన సి.పి.ఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, శంకరయ్య, రామదాసు, తిరుపతిరావు, ప్రజా సంఘాల నాయకులపై టి.డి.పి. మూకల దాడిహేయమైనదని, ఈ దాడిని సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మంగళవారం అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి తిరుపతయ్య, సి.పి.ఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, శంకరయ్య, రామదాసు , ప్రజాసంఘాల నాయకులు జామాయిల్ చెట్ల దొంగతనంపై తహశీల్దారుకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లారని, ఈ క్రమంలో అక్కడికి చేరుకున్న టి.డి.పి. మూకలు వారిని దుర్భాషలాడుతూ దాడికి దిగడం దారుణమన్నారు. జామాయిల్ చెట్ల దొంగతనంపై ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన నాయకులపై దాడికి దిగడం దుర్మార్గమని, సి.పి.ఐ నాయకులపై దాడికి దిగిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి : రైతు సంఘం

నాయకులపై దాడిచేసిన టిడిపి మూకలను అరెస్టు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పి శ్రీరాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అగ్రిగోల్డ్ వల్ల నష్టపోయిన బాధితులు కోర్టును ఆశ్రయించడంతో , అగ్రిగోల్డ్‌కు సంబంధించిన ఆస్తులను కోర్టు సీజ్ చేసిందన్నారు. ఆ సంస్థకు సంబంధించిన భూములు వరికుంట పాడు మండలంలో ఉన్నాయన్నారు. ఆ భూముల్లో ఉన్న జామాయిల్ చెట్లను ఇటీవల కొందరు వ్యక్తులు అక్రమంగా నరికేశారన్నారు. 15 ఏళ్లపాటు బలిన పై చెట్లను ఇటీవల కొందరు దొంగతనముగా 10 లారీలతో మరో ప్రాంతానికి తరలించారన్నారు. దీనిపై వరికుంట పాడు తహశీల్దార్ కార్యాలయం లో రిపోర్ట్ చేసి ధర్నా చేసేందుకు అగ్రిగోల్డ్ రాష్ట్రనాయకులు ముప్పాల నాగేశ్వరావు, తిరుపతి రావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య లు మరికొందరు తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి వారిపైదాడి చేయడం సిగ్గుచేటని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పులిగండ్ల శ్రీరాములు పేర్కొన్నారు.

గంజాయి స్వాధీనం



ప్రజాశక్తి-కందుకూరు : అక్రమంగా తరలిస్తున్న రూ. 17 లక్షల 50 వేల విలువగల 100 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు కందుకూరు డి.ఎస్.పి బాలసుబ్రమణ్యం తెలిపారు. కందుకూరు డిఎస్‌పి కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో డిఎస్‌పి బాలసుబ్రమణ్యం మాట్లాడారు. ముందుగా వచ్చిన సమాచారం మేరకు ఉలవపాడు జాతీయ రహదారి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి గుడి వద్ద వాహనాలను తనిఖీ చేశారు. కందుకూరు సిఐ కె వెంకటేశ్వరరావు, ఉలవపాడు ఎస్ఐ కె అంకయ్య, ఉలవపాడు పోలీస్ సిబ్బందితో కలిసి గంజాయి అక్రమ రవాణ గురించి రాబడిన సమాచారం మేరకు ఉలవపాడు జాతీయ రహదారి పై వాహనాలను తనిఖీ చేశారు.. నెల్లూరు వైపు గంజాయి అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తులు క్యాబ్ వాహనంలో వస్తూ పోలీసులను చూసి వాహనాన్ని వెనక్కి తిప్పి పారి పోవడానికి ప్రయత్నించారు. అది గమనించిన పోలీస్ సిబ్బంది ఆ వాహనాన్ని వెంబడించి పట్టుకోవడం జరిగింది. ఆ సందర్భంలో ఒకరు పారిపోగా ఇద్దరు వ్యక్తులు దొరికారు. దొరికిన వారిని విచారించగా అనకాపల్లి జిల్లా మాడుగుల మండలం కొత్తలి గ్రామానికి చెందిన ఇల్లపు నాగేశ్వరరావు, అనకాపల్లి జిల్లా నాతవరం మండలం పుప్పెపల్లి గ్రామానికి చెందిన తాడి సత్యనారాయణ గా గుర్తించారు,వీరు ఒరిస్సా రాష్ట్రం నుంచి తమిళనాడు రాష్ట్రానికి గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. విలేకర్ల డిఎస్పి బాలసుబ్రమణ్యం తో పాటు కందుకూరు సిఐ కె వెంకటేశ్వర్ రావు, ఉలవపాడు ఎస్సై కే అంకమ్మ పాల్గొన్నారు.

న్యాయసేవ సహాయకుల భర్తీకి చర్యలు

నెల్లూరు : గూడూరు, కోవూరు, కావలి, ఆత్మకూరు, వెంటగిరి, కోట, సూళ్లూరుపేట, నాయుడుపేట, ఉదయగిరిలలో పారా లీగల్ వాలంటీర్లుగా (న్యాయసేవ సహాయకులు) పనిచేయుటకు అర్హులైన వారు ఈ నెల 26వ తేదిలోగా దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా న్యాయసేవాధికారి సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి జి. గీత తెలిపారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటనలో విడుదల చేశారు. 18 ఏళ్ల వయస్సు నిండిన వారు ఇంటర్, ఆపైన విద్యార్హత సర్టిఫికెట్లు, రెండు పాస్‌ఫోటోలు, రిజిష్టరుపోస్టు చేయుటకు సెల్ఫ్ అటెస్టెడ్ ఎన్వలాప్ కవర్ రూ.25 స్టాంపులతో జతచేసి దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

'మెడికవర్'లో ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు

ప్రజాశక్తి -నెల్లూరు : వయస్సు పైబడి మోకాలి నొప్పులతో బాధపడేవారు నగరంలోని మెడికవర్ హాస్పిటల్లో ఉచితంగా నిర్వహించే ఆర్థో పెడిక్ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని హాస్పిటల్ సెంటర్ హెడ్ డాక్టర్ ధీరజ్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. . ఈనెల 28వ తేదీ వరకూ మోకాలి మార్పిడికి సంబంధించి ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ధీరజ్ రెడ్డి సూచించారు.

21నుంచి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-నెల్లూరు : మహాశివరాత్రిని పురస్కరించుకోని 26న మూలాపేటలోని శ్రీ భువనేశ్వరి సమేత శ్రీ మూలాస్థానేశ్వర స్వామి బ్రహ్మోత్సవ వేడుకలునిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఒ ఎన్ఎస్ అనూష సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. మంగ ళవారం మూలపేట శివాలయ ఆవరణలో మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాల నిర్వహణకు సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆర్‌డిఒ మాట్లాడుతూ ఈనెల 21 నుండి మార్చి 5 వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయన్నారు. డి.ఎస్.పి సింధు ప్రియ దేవాదాయ సహాయ కమిషనర్ జనార్దన్ రెడ్డి, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ సుజాత, నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఆలయ ఈవో శ్రీనివాసులు రెడ్డి ఉన్నారు.

జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలకు

కందుకూరు యువకుడు ఎంపిక

ప్రజాశక్తి-కందుకూరు : జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలకు కందుకూరు యువకుడు ఎంపికయ్యాడు కందుకూరు సంతోష్ నగర్‌కు చెందిన షేక్ అలీం స్వయం కృషితో జాతీయ స్థాయి కి ఎదగడం వెనుక తల్లి తండ్రి ప్రోత్సాహం వుంది. బి.టెక్ పూర్తి చేసి ప్రస్తుతం ఎం. టెక్ చదువుతున్న అలీం కందుకూరు వ్యక్తి కావడం అభినందనీయం అని సంతోష్ నగర్ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పరీక్ష హాలులో తనిఖీ

ప్రజాశక్తి-కందుకూరు : ఆంధ్రకేసరి యూనివర్శిటీ ఎం.బి.ఏ మూడో సెమిస్టర్ పరీక్షా కేంద్రాన్ని ఆంధ్ర కేసరి యూనివర్శిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి. హరిబాబు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హరిబాబు మాట్లాడుతూ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించి యూనివర్శిటీకి మంచిపేరు తీసుకొని రావాలని నిర్వాహకులకు సూచించారు. విద్యార్థులు పరీక్షలను వ్రాస్తున్న విధానాన్ని ఆయన నిశితంగాపరిశీలించారు.పట్టణంలోని ఓ వి రోడ్ లో ఉన్న శ్రీ వివేకా డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రంలో ఎంబీఏ కస్టమర్ రిలేషన్ షిప్ మేనేజ్ మెంట్ మూడో సెమిస్టర్ పరీక్షలను తీరుతెన్నులను పరిశీలించారు. ఎకెయు అబ్జర్వర్ డాక్టర్ సయ్యద్ ఆసిఫ్ ఉద్దీన్, చీఫ్ డిపార్ట్మెంట్ డి. శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ అబ్బూరి వెంకటేశ్వర్లు ఉన్నారు.

మద్యం దుకాణం తొలగించాలి

ప్రజాశక్తి-కందుకూరు : గాంధీ విగ్రహానికి అతి సమీపంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని మరో ప్రదేశానికి తరలించాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి సురేష్ బాబు డిమాండ్ చేశారు .మంగళవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తహశీల్దార్ కార్యాలయానికి సమీపంలో ప్రభుత్వ కార్యాలయాలు అతి సమీపంలో ఉన్న ప్రదేశంతోపాటు కూత వేటుదూరంలో ఉన్న పోలీస్ స్టేషన్ కూత వేటు సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయటం ప్రజలకు మనోవేదన కలిగించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఐ సీనియర్ నాయకులు ద్రోణాదుల ఆదినారాయణ ,ఉప్పుటూరి మాధవరావు ఉన్నారు.

పలుచోట్ల పొలం పిలుస్తోంది..

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : క్రిమి సంహారక మందుల వాడకంలో అవగాహన ఉండాలని మండల వ్యవసాయాధికారి వివి శిరీష రాణి సూచించారు. మంగళవారం వరిగొండ బిట్-1, 2 గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. శిరీ ష రాణి మాట్లాడుతూ రైతులందరూ తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి అని తెలిపారు. అనంతరం శాస్త్రవేత్తలతో కలిసి వరి పొలాలను సందర్శించారు. రావూరివారికండ్రిగలో మధుసూదన్ రెడ్డి పొలాన్ని సందర్శించారు. ఏఈఓ ప్రసన్న విఏఏ సుమంత్ ఉన్నారు.

ప్రజాశక్తి-కందుకూరు : మండలంలోని మోపాడు,మాచవరం గ్రామంలో మండల వ్యవసాయాధికారి వి రాము ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. రాము మాట్లాడారు. రెండు గ్రామాల గ్రామ వ్యవసాయ సహాయకులు రమణయ్య, రోసీ రేచల్, వ్యవసాయ మార్కెట్ యార్డు అసిస్టెంట్ కె అశోక్ ఉన్నారు.

రైతులకు నష్టపరిహారం పెంచాలి

ప్రజాశక్తి -నెల్లూరు : జిల్లాలో నిర్మించనున్న భారత్ మాల ,సాగరమాల, జాతీయ రహదారుల నిర్మాణంలో భూములు కోల్పో తున్న రైతులకు నష్టపరిహారం పెంచి ఇవ్వాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ,రైతు సంఘం, కౌలు రైతు సంఘం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో కలెక్టర్ ఒ ఆనంద్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య మాట్లాడుతూ జిల్లాలో ఏడు మండలాల్లో 108 కిలోమీటర్లు సాగరమాల 30 కిలోమీటర్లు జాతీయ రహదారుల నిర్మిసు_న్నారని 35 గ్రామాల్లో 900 ఎకరాలు భూ సేకరణ జరుగుతుందని భూసేకరణ లో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం నవమాత్రంగా చెల్లిస్తున్నాం న్నారు. నిబంధనలకు ప్రకారంగా ఎక్కడా చెల్లించడం లేదని నిబంధనల ప్రకారం ఎక్కడ నష్టపరిహారం చెల్లించడం లేదని ఆనాటి కలెక్టర్‌ను కలిస్తే ఆర్బిట్రేషన్ పెట్టిస్తున్న వేసుకోండి నష్టపరిహారం పెంచి ఇస్తామని సలహా ఇచ్చారన్నారు. అనేక గ్రామాల ప్రజలు ఆర్బిట్రేషన్ వేసిన ఇప్పటివరకు విచారణ జరగడం లేదని ఎక్కడ నష్టపరిహారం పెంచి ఇవ్వలేదన్నారు. కొన్ని మండలాల్లో నష్టపరిహారం ఇంకా చెల్లించలేదన్నారు. ఈ సమస్యపై స్పందించి కలెక్టర్ తక్షణమే నష్టపరిహారం పెంచడానికి చర్యలు చేపట్టాలని కోరారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య మాట్లాడుతూ టిపి గూడూరు మండలం పేడూరు గ్రామంలో బి బి సి ఎల్ పైపులై నిర్మాణంలో కరుకు మీద ఉన్న పంట పొలాలను ధ్వంసం చేసి పైపులై నిర్మించాలని పూనుకోవడం బాధాకరమని వెంటనే పైపులైను నిర్మాణ పనులు ఆపి పంట కోతలు అయిన తర్వాత పైపులైన్ నిర్మాణం చేసుకోవాలని ప్రస్తుతం పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పులిగండ్ల శ్రీరాములు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నలగడ్డ వెంకమ్మ రాజు తీపి గూడూరు మండలం కార్యదర్శి ఈపూర్ లక్ష్మయ్య సిఐటియు నాయకులు మారు బోయిన రాజా భూ నిర్వాసిత రైతులు పోతు గుంట కష్ణయ్య ఆదిశేషయ్య వంశీకష్ణ లక్ష్మీ నరసయ్య పాల్గొన్నారు



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇనాం భూములను పేదలకు పంపిణీ చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-నెల్లూరు : ఆమంచర్ల పంచాయతీ మట్టెంపాడుకు చెందిన సర్వే నెంబరు 3లో 500 ఎకరాల ఇనాం ఇనాం భూమిని పేదలకు పంపిణీ చేయాలని సిపిఎం రూరల్ కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం నగరంలోని డాక్టర్ రామచంద్రారెడ్డి భవన్‌లో సిపిఎం రూరల్ మండల కమిటీ విలేకర్ల సమావేశం నిర్వహించింది. సిపిఎం నాయకులు ఆలూరు తిరుపాలు, పొట్టేపాళెం చంద్రమౌళి, పూడిపర్తి జనార్దన్ మాట్లాడారు. భూమికి రాచమల్లు రమేష్ అనే వ్యక్తి దొంగపట్టాలు సృష్టించి గెస్ట్‌హౌస్ నిర్మాణాలు చేస్తున్నారన్నారు. దీనిని ప్రశ్నించిన వారిపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఈ వ్యవహారంపై విచారణ చేపట్టి ఇనాం భూములను పరిశీలించి అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని సిపిఎం నాయకులు కోరారు.



మట్లాడుతున్న సిపిఎం నాయకులు

జిఒ నెంబర్ 117ను రద్దు చేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు

అన్ని వర్గాల ప్రజలకు విద్య అందితేనే దేశ అభివృద్ధి సాధ్యమని ఆవాజ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు అభిప్రా యపడ్డారు. మంగళవారం నగరంలోని మినీ బైపాస్ వద్ద ఉన్న భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ రఫీ అధ్యక్షత వహించి మాట్లాడారు. జిఒ నెంబర్ 117 జిఒను గత ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చి దేశంలో ఎక్కడా లేని విధంగా విద్యా వ్యవస్థను చిన్నాభిన్నం చేసిందన్నారు. తద్వారా జిల్లాలో కొన్ని స్కూళ్లు మూతపడ్డాయన్నారు. . సిఐటియు నాయకులు సతీష్ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారిన ప్రతి సారి విద్యా వ్యవస్థను నాశనం చేస్తున్నాయని తద్వారా పేద బడుగు, బలహీన, వర్గాల పిల్లలు చదువుకు దూరం అవుతున్నారన్నారు. ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శివకుమారి, మస్తాన్ బి మాట్లాడుతూ మోడల్ స్కూల్ ల పేరుతో మూడు, నాలుగు కిలోమీటర్ల దూరంలో స్కూలు పెడితే విద్యార్థినులు చదువుకు దూరం అయ్యే అవకాశం ఉందన్నారు. అందువలన ప్రస్తుతం స్థానికంగా ఉన్న స్కూళ్ల ద్వారా మెరుగైన విద్య కు కూటమి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బిపి నరసింహ మాట్లాడుతూ ప్రభుత్వాలు ఎన్ని మారిన ఉపాధ్యాయుల భర్తీ విషయంలో చిన్నచూపు చూస్తున్నారని అందువలన వీలైనంత త్వరగా డీఎస్సీ ఇచ్చి ఉపాధ్యాయులను భర్తీ చేయాలన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జీవన్, జమాతే ఇస్లామీ హింద్ జిల్లా నాయకులు నవీద్ , రిటైర్డ్ ఉపాధ్యాయులు నబీవుల్లా, మునీర్ మాట్లాడారు. ఆ జిఒను రద్దు చేయాల్సిం దేనన్నారు. ఆవాజ్ జిల్లా కమిటీ సభ్యులు షేక్ రియాజ్, షేక్ చాన్ బాషా, షేక్ జానీ బాషా, షేక్ మునీర్ భాష, సయ్యద్ రవూఫ్, షేక్ నాయబ్, నగర నాయకులు సమీవుల్లా, షేక్ సలాం, ఇతర ప్రజా సంఘాల నాయకులు ఉన్నారు.




రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

పేదలను విస్మరించిన కేంద్ర బడ్జెట్

22న సదస్సు

ప్రజాశక్తి-కందుకూరు : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ను వ్యతిరేకిస్తూ సిపిఐ, సిపిఎం, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పి. మాలకొండయ్య ,సిపిఎం కందుకూరు కార్యదర్శి ఎస్ఎ గౌస్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో ప్రజా వ్యతిరేక ప్రతిపాదనలను ప్రజలు తిరస్కరించాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో కొనుగోలు శక్తి కుచించుకుపోయిన ఆర్థిక వ్యవస్థలో తగ్గిన డిమాండ్ సమస్యను పరిష్కరించడానికి బదులు మోడీ ప్రభుత్వం సంపన్నులకు రాయితీలు ఇస్తూ పేదలను విస్మరించిందన్నారు. నిరుద్యోగ సమస్యకు పరిష్కారం చూపలేదన్నారు. ఆహార సబ్సిడీలు, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివద్ధి, సామాజిక సంక్షేమంపై పెట్టిన ఖర్చు గత ఏడాది కంటే బాగా తగ్గిపోయిం దన్నారు. ఇంకా సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు ఆర్ మోహన్ మాట్లాడారు. ఈ ప్రజా వ్యతిరేక బడ్జెట్ ను వ్యతిరేకిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 22 శనివారం సాయంత్రం 4 గంటలకు పట్టణంలోని ఎన్‌జిఒ హోమ్‌లో సదస్సు జరుగుతుం దన్నారు. జయప్రదం చేయాల న్నారు. సిపిఐ కందుకూరు నియోజకవర్గ కార్యదర్శి బి.సురేష్ బాబు, షేక్ హుస్సేన్, మురళి, సిఐటియు నాయకురాలు సల్మా, మల్లిక ఉన్నారు.



విద్యా రంగం సమస్యలు పరిష్కరించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-నెల్లూరు : ఎస్ఎఫ్ఐ పొదలకూరు మండల కమిటీ జనరల్ బాడీ సమావేశం స్థానిక సిపిఎం కార్యాలయంలో దువ్వూరు పాండు అధ్యక్షతన జరిగింది. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వి. నరేంద్ర హాజరై మాట్లాడారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాటాలు చేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చినటువంటి హామీలన్నీ కూడా అమలు చేయకపోగా, విద్యా సంవత్సరం పూర్తి కావస్తున్న డిగ్రీ విద్యార్థులకు అందజేయాల్సి ఉన్న విద్యా, వసతి దీవెనలు బకాయిలు ఇప్పటికే 3400 కోట్ల రూపాయలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పెండింగ్ బకాయిల విడుదల చేయాలని కోరారు. అనంతరం ఎస్ఎఫ్ఐ మండల కమిటీని ఎన్నుకున్నారు.అధ్యక్షులు మోక్ష, కార్యదర్శిగా ఎస్కే. మస్తాన్ వలి, ఉపాధ్యక్షులుగా రాజేష్, వికాస్, కిషోర్, వినయ్, మనోజ్, సహాయ కార్యదర్శిగా నవీన్, ప్రదీప్, పవన్, సాయి, కమల్, ఆరిఫ్, 19 మందితో నూతన కమిటీ ఏర్పాటైంది.ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి కె. పెంచల నరసయ్య, సిఐటియు మండల కార్యదర్శి బి. మనోహర్, రషీద్, కుమార్ ఉన్నారు.

లింగ నిర్ధారణ సరికాదు

ప్రజాశక్తి-నెల్లూరు : గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం (పిసి పిఎన్‌డిటి యాక్టు) అమలు పై సంబంధిత కమిటీ సభ్యులకు, స్కానింగ్ కేంద్ర నిర్వాహకులకు, మెడికల్ అసోషియేషన్లకు వివిధ శాఖల అధికారులకు డిఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయంలో జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టరు వి.సుజాత అధ్యక్షత వహించారు. భ్రూణ హత్యలను నివారించాలన్నారు. డి ఎల్ ఏ టి ఓ డాక్టరు షేక్. ఖాదర్ వలి, డి ఐ ఓ డాక్టరు ఏ. ఉమామహేశ్వరి కమిటీ సభ్యులు ప్రొఫెసర్ (పీడియాట్రిక్) డాక్టరు సర్దార్ సుల్తానా, గైనకాలజిస్ట్ డాక్టరు సి హెచ్ కిరణ్, డివిజనల్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టరు పి.ఎల్ దయాకర్, డి ఎస్ పి శ్రీ కె సి హెచ్ రామారావు, డెప్యూటీ డి ఎం హెచ్ ఓ లు డాక్టరు బ్రిజిత, రజని ఉన్నారు.

బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి-నెల్లూరు : నగర పాలక సంస్థ పరిధిలోని ఆస్తి పన్ను, కొళాయి పన్నులు, ఖాళీ స్థలం పన్ను, మున్సిపల్ షాపు రూముల బాడుగల వసూళ్లకై నిర్ధేశించి లక్ష్యాలను వేగవంతంగా పూర్తి చేసి, వంద శాతం లక్ష్యాలను సాధించాలని డిప్యూటీ కమిషనర్ చెన్నుడు రెవెన్యూ విభాగం అధికారులు, సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. నగర పాలక సంస్థ రెవెన్యూ విభాగం అధికారులు, సచివాలయ అడ్మిన్ కార్యదర్శులతో కమాండ్ కంట్రోల్ విభాగంలో మంగళవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ ఎనిమిది సంవత్సరాల పైబడి బకాయి ఉన్న యజమానులను కలిసి బకాయిలు వసూలు చేయాలని ఆదేశించారు. నగర పాలక సంస్థ రెవెన్యూ అధికారి ఇనాయతుల్లా, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఇన్స్పెక్టర్లు, వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు ఆర్‌టిసి డిపో రిటైర్డ్ ఉద్యోగుల తృతీయ వార్షికోత్సవ కార్యక్రమం మగళవారం కందుకూరు డిపో ప్రాంగణంలో జరిగింది. ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అద్దంకి సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు హరిప్రసాద్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నామమాత్రం పెన్షన్ తీసుకుంటున్న రిటైర్డ్ ఉద్యోగులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. వీరికి వద్ధాప్య పెన్షన్ తోపాటు రేషన్ కార్డులు, ఇంటి స్థలాలు, పక్కా ఇళ్ళు మంజూరు చేయాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు విజ్ఞప్తి చేశారుఅనంతరం నూతన కార్యవర్గని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గౌస్ బాషాను, కార్యదర్శిగా ఉమ్మడిశెట్టి వెంకటేశ్వర్లను, కోశాధికారిగా ఆదిశేషుతోపాటు పలువురు కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు. రీజినల్ సెక్రటరీ పోలేరయ్య, అధ్యక్షుడు మహేశ్వరావు, ఎంఎన్.రావుతో పాటు పలువురు విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు. తదుపరి 75 ఏళ్ల వయసు దాటిన ఉద్యోగులను ఘనంగా సన్మానించారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ

ప్రజాశక్తి -గుడ్లూరు : గుడ్లూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి అనే కార్యక్రమం పై శిక్షణా తరగతులు ఎంఇఒ గోవర్ధన్ మంగళవారం ప్రారంభించారు. ఈ శిక్షణ తరగతులు తొలి విడతగా మూడు రోజులు పాటు నిర్వహిస్తామని, అనంతరం మరో మూడు రోజులపాటు సెక్షన్ ఆ తరగతిలో ఏర్పాటు చేయడం జరుగుతుందని ఐసిడిఎస్ అధికారులు తెలిపారు. జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామ్మోహన్ ఐసిడిఎస్ సూపర్వైజర్ కామేశ్వరి డి ఆర్ పై లు ఏ విజయ్ కుమార్ వర ముని కుమార్ పి చంద్రశేఖర్ 55 మంది అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్ : గుడ్లూరు మండలంలోని దార కాని పాడు గ్రామం వద్దనున్న మన్నేరు వాగులో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారు. దీనిపై దారకాని పాడు విఆర్ఒ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుడ్లూరు ఎస్ఐ వై వెంకట్రావు ముగ్గురు వాహనదారులపై కేసు నమోదు చేశారు.

విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ



ప్రజాశక్తి-కొండాపురం

మండలంలోని కస్తూర్బా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మోడల్ స్కూల్ విద్యార్థులకు మంగళవారం కంటి అద్దాలను ఎంఎల్ఎ కాకర్ల సురేష్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దృష్టి లోపంతో బాధపడుతున్న విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి కంటి చూపు అద్దాలను పంపిణీ చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ లోపంతో విద్యార్థులు సరిగా చదువు పైన దృష్టి పెట్టలేకపోతున్నారని ఇది గమనించే ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థులు చక్కగా చదువుకొని వారి భవిష్యత్తును వారి చక్కదిద్దుకోవాలన్నారు. అనంతరం మొక్కలను నాటారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. డిఇ కార్యాలయంలో పార్టీ శ్రేణులు, అధికారులతో రివ్యూ నిర్వహించారు. గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలపై ఆయన అధికారులతో చర్చించి వెంటనే పరిష్కరించాలని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ సభ్యులు ధామినేశ్వరరావు, టిడిపి డైరెక్టర్ సభ్యులు తాటికొండ అనూష, వై.కృష్ణయ్య, పోలేని చంద్రబాబు, అల్లిక మధు, కుంకు మోహన్‌రావు, జాగర్లమూడి శ్రీనివాసులు, పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రం చేసుకోవాలి

ప్రజాశక్తి-బిట్రగుంట : ఇంటి పరిసర ప్రాంతాల్లో చెత్తాచెదారం లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా డ్వామా పిడి గంగాభవాని పేర్కొన్నారు. బోగోలు మండలం కొండ బిట్రగుంట గిరిజన కాలనీలో నిర్వహించిన ఇంకుడు గుంతలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి పరిసర ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవడం వల్ల వర్షపు నీరు వృథా కాకుండా భూమిలోకి ఇంకిపోవడం వల్ల భూగర్భ జలాలు అడుగంటవని బోరు, బావుల్లో నీళ్లు పుష్కలంగా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ రావి విజయ్‌కుమార్ యాదవ్, మారుతి, అశోక్, ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలతో కూడిన విద్యనందించాలి

ప్రజాశక్తి-కోవూరు : పూర్వ ప్రాథమిక పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్చుకుంటున్న చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తేనే వారిలో దాగి ఉన్న అనేక నైపుణ్యాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని ఎంఇఒ రహీమ్ అన్నారు. కోవూరులోని జెబిఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమావేశ మందిరంలో మంగళవారం జ్ఞానజ్యోతి కార్యక్రమం ద్వారా అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రీస్కూల్ యాక్టివిటీస్‌పై అవగాహన కల్పించారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయులు శ్రీహరి, సూపర్‌వైజర్లు రాధిక, ప్రసూనలక్ష్మి, రిసోర్స్‌పర్సన్లు మహేంద్ర, శ్రీనివాసులు పలు సూచనలు చేశారు.

ధాన్యం పరిశీలన



ప్రజాశక్తి-దగదర్తి : మండలంలోని ధాన్యం రాసులను అగ్రికల్చర్ ఎఒ అబ్దుల్ రహీం మంగళవారం పరిశీలించారు. అక్కడే ధాన్యాన్ని లారీ లోడ్ చేస్తుండగా రైతుల నుంచి ఎంతకి ధాన్యం అమ్ముకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ ధరకు ధాన్యాన్ని అమ్ముకోవాల్సిన అవసరం లేదన్నారు. దగదర్తి గ్రామంలో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ద్వారా ఏర్పాటు చేస్తున్నారని రైతులు దళారుల వద్ద తక్కువ ధరకు తెగనమ్ముకోవాల్సిన అవసరం లేదని రైతులకు సూచించారు. బిపిటి 1638 గ్రేడ్ ఎ రకం క్వింటాళ్లకు ప్రభుత్వ మద్దతు ధర రూ.2320, పుట్టికి రూ.19720 ఉందని తెలిపారు. రైతులు స్థానిక రైతుసేవా కేంద్రాలను కానీ లేదా ధాన్యం కొనుగోలు కేంద్రాలను కానీ సంప్రదించాలన్నారు.

వాటర్‌గ్రిడ్ ఏర్పాటుకు స్థల పరిశీలన

ప్రజాశక్తి-ఉదయగిరి : పట్టణ శివారు ప్రాంతమైన సొదగుంట ప్రాంతంలో వాటర్ గ్రిడ్ ఏర్పాటుకు మంగళవారం ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ జగన్నాథ్ ప్రయివేటు ఏజెన్సీ సభ్యులు స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎల్ఎ కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని తాగునీటి ఎద్దడి నివారించేందుకు ముందస్తుగా వాటర్‌గ్రిడ్ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. త్వరలోనే పనులను చేపట్టి తాగునీటి సమస్య లేకుండా తీరుస్తామన్నారు. ఇంజనీర్ అసిస్టెంట్ నరసింహ, సందాని, పలువురు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-ఉదయగిరి : ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చదువుతోపాటు సమాజంలో జరుగుతున్న ఇతర అంశాలపై పట్టు సాధించేందుకు మాక్ పంచాయతీ ఏర్పాటుతో మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా పంచాయతీ పాలన లాగే సర్పంచ్, ఉప సర్పంచ్, జెడ్‌పిటిసి, ఎంపిటిసి, పంచాయతీ కార్యదర్శులుగా విద్యార్థులు ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీలో నెలకొన్న సమస్యలను ఎలా పరిష్కరించాలన్న విషయాలపై చర్చ కొనసాగించారు. కార్యక్రమంలో ఎంఇఒ తోట శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు బాలశేషువులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విఆర్‌ఒలతో తహశీల్దారు సమావేశం

ప్రజాశక్తి-దగదర్తి : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గ్రామ రెవెన్యూ అధికారులతో తహశీల్దార్ వి.కృష్ణ మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీవెన్స్ డే వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. అర్జీదారులు ఇన్‌కమ్, క్యాస్టింగ్, డేట్ ఆఫ్ బర్త్, డెత్ సర్టిఫికెట్ కోసం వచ్చినప్పుడు అర్జీదారులను కార్యాలయం చుట్టూ తిప్పకుండా వారి పనిచేసి పంపించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రమేష్, విఆర్‌ఒలు నాగరాజు, గౌతమ్, నరేష్, శిరీష, బాలయ్య, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్ల భాషా దినోత్సవం

ప్రజాశక్తి-ఉలవపాడు : మండల పరిధిలోని పెదపట్టపుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఇంగ్లీష్ లాంగ్వేజ్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్‌కె.సలీంభాషా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఫ్లీక్ భాషతో వారి నైపుణ్యాన్ని ప్రదర్శించినట్లు తెలిపారు. ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు కె.వి.రాజు, అనురాధ పాల్గొని మాట్లాడుతూ ఇంగ్లీష్ భాషపై విద్యార్థులకు మక్కువను ఉపాధ్యాయులు కొనియాడారు.

వివిఎలకు శిక్షణ

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండలంలోని వెలుగు కార్యాలయంలో వివిఎలకు లోకోస్ శిక్షణ కార్యక్రమాన్ని ఎపిఎం సలీమ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పొదుపు గ్రూపు సభ్యుల వివరాలు, వారి గ్రూపు లావాదేవీలు, బ్యాంకు ఖాతాల లావాదేవీలు, గ్రూపు సభ్యుల ఆధార్, బ్యాంక్ వివరాలు, వారి కులము, ఉప కులము తదితర విషయాలన్నింటినీ ఎలా నమోదు చేయాలో మొబైల్‌లో అను అంశాలపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం జరుగుతున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో సిసిలు, వివిఎలు, ఆకౌంటెంట్ పాల్గొన్నారు.

'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి-సీతారామపురం : సీతారామపురం మండలంలోని బసినేనిపల్లి గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మండల వ్యవసాయాధికారి పి.చెన్నారెడ్డి తెలిపారు. గ్రామసభలో రైతులు పాటించాల్సిన వివిధ పంటలలో యాజమాన్య పద్ధతులు, ఎరువు వాడడం వల్ల భూమి సారవంతమై వివిధ తెగుళ్లను మొక్కలు తట్టుకుంటాయని తెలిపారు. రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ రైతు సేవా కేంద్రాల్లో చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ విజయ్, విఎఎ షఫీన్ పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యశాలలో పరిశీలన

ప్రజాశక్తి-కోవూరు : భారతదేశంలో కరోనా తర్వాత ఆయుర్వేదానికి గుర్తింపు వచ్చిందని కోవూరు నియోజకవర్గ జనసేన నాయకుడు సిహెచ్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. కోవూరులోని కొత్తూరు రోడ్డులో ఉన్న పాత ఆయుర్వేద వైద్యశాలను మంగళవారం ఆయన ఆయుర్వేద వైద్యులు డాక్టర్ గంగాధర్‌తో కలిసి నిశిత పరిశీలన చేపట్టారు. ఎంఎల్ఎ ప్రశాంతిరెడ్డి దృష్టికి ఈ ఆయుర్వేద ఆస్పత్రి పరిస్థితిని తీసుకువెళ్లి ఈ కూటమిప్రభుత్వం దానికి పూర్వవైభవం వచ్చేలా ఎంఎల్ఎ చొరవతో ముందు సాగుతామన్నారు. జనసేన జిల్లా కార్యదర్శి మున్వర్ బాషా, మండలాధ్యక్షుడు అల్లాడి బాబ్, రమ్య, పవన్, మహేష్, మురళి, తదితరులున్నారు.

ఈ-కెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి విడవలూరు : మండల పరిధిలోని ఒకటి, రెండు రైతు భరోసా కేంద్రాలలో గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి సుజాత ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ పథకాలను పొందాలంటే తప్పనిసరిగా ఈ-కెవైసి చేయించుకోవాలన్నారు. ఆదేవిధంగా వ్యవసాయంలో డ్రో మాడోలిన్ అనే ముందును నాలుగు కెజిలు సూకులతో కలిపి పిచికారి చేయాలన్నారు. కర్ణాటకలో ఆపిల్ పంటలో ఎలుకల బ్రెడ్ ఉంచాలని తెలిపారు. ప్రతి రైతు ఈ పంటను నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి వెంకట కృష్ణయ్య, వివిఎలు, రైతులు పాల్గొన్నారు.

ఉపాధిహామీలో రూ.11లక్షలు స్వాహా..

- ఐదుగురు ఫీల్డ్ అసిస్టెంట్లు సస్పెన్షన్
- ఎంపిడిఒ ఆఫీస్ అటెండర్‌కు షోకాజ్ నోటీస్


మాట్లాడుతున్న డ్వామా పిడి గంగాభవాని

ప్రజాశక్తి-కావలి

కావలి మండలంలోని పేదలకు ఉపాధి పని కల్పించడంతోపాటు, గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు ఉద్దేశించి నిర్వహిస్తున్న "మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం" పనులలో సిబ్బంది చేతివాటం ప్రదర్శించి రూ.11,37,684లను స్వాహా చేశారు. ఉమామహేశ్వరపురం, లక్ష్మీపురం, తుమ్మల పెంట, సర్వాయపాలెం, రుద్రకోట లకు సంబంధించిన ఐదుగురు ఫీల్డ్ అసిస్టెంట్లను అధికారులు సస్పెండ్ చేశారు. అలాగే ఆఫీస్ సబార్డినేట్ చామంతికి షోకాజ్ నోటీస్ ఇచ్చారు. ఈ విషయం మంగళవారం కావలి ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన "సామాజిక తనిఖీ ప్రజా వేదిక"లో బహిర్గత మైంది. దాంతో ఆగ్రహం వ్యక్తం చేసిన డ్వామా పిడి గంగాభవాని ఆ నిధుల రికవరీకి ఆదేశించారు. అనంతరం ఆమె వివరాలను వెల్లడించారు. కావలి మండలంలోని 17 పంచాయతీల్లో 2023-2024 ఆర్థిక సంవత్సరం ఉపాధి హామీ పథకం ద్వారా దాదాపుగా రూ.12 కోట్లతో వివిధ పనులు చేపట్టారన్నారు. గత 15 రోజుల నుండి 17 వివిధ సామాజిక తనిఖీ బృందం గ్రామాలలో విచారణతో పాటు క్షేత్రస్థాయిలో ఉపాధి పనులు చేపట్టిన పనుల పై తనిఖీలు నిర్వహించారని తెలిపారు. నిబంధనలు, కొలతల ప్రకారం పనులు జరిగాయా.. లేదా.. కూలీల హాజరు నగదు చెల్లింపులు తదితర విషయాలను సమగ్రంగా పరిశీలించామన్నారు. ఒకరి జాబ్ కార్డుపై మరొకరు పనిచేయడం, అలాగే ఒకే కుటుంబంలో రెండు జాబుకార్డులు ఉండడం, తదితర అంశాలపై వివరాలు రాబట్టారని తెలిపారు. దానిపై ఒక నివేదికను రూపొందించామన్నారు. వనుల ఆడిటింగ్ నివేదికపై సామాజిక తనిఖీ బహిరంగ ప్రజావేదికలు గ్రామ వారీగా విచారణ చేపట్టారని తెలిపారు. కావలి మండలంలోని వివిధ పంచాయతీల్లో మస్టర్, కొలతల్లో తేడాలు చూపించి నిధులు స్వాహా చేసినట్లు తనిఖీ అధికారులు గుర్తించామన్నారు. అందులో అత్యధికంగా రాజువారి చింతల పాలెం పంచాయతీలో రూ.1,60,832లతో ప్రథమ స్థానంలో నిలవగా, అత్యల్పంగా చలంచర్ల రూ.1188 నమోదైందన్నారు. ఈ అవినీతిపై జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకురాలు గంగాభవాని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం 10 గంటలకు ప్రారంభ మైన ఈ ప్రజా వేదిక సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. కార్యక్రమంలో అంబుడ్స్ మెన్ విజయ, ఎపిడి మృదుల, ఎపిడిఒ సిహెచ్ శ్రీదేవి, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వేణు గోపాల్, ఉపాధి హామీ ఎపిఒ పెంచలమ్మ, సిబ్బంది, తదితరులున్నారు.

సర్వసభ్య సమావేశంలో నిరసనలు


నిరసన చేపడుతున్న ఎంపిపి, ఇతర సభ్యులు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

స్థానిక మండల అభివృద్ధి కార్యాలయంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు బోయిళ్ళ పద్మజారెడ్డి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం భారీ నిరసనల మధ్య బాయ్‌కాట్ చేశారు. అనంతరం ఎంపిపి పద్మజారెడ్డి మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు ఏమైనట్లు అని వాటికి సంబంధించిన వివరాలను తమకు తెలియజేయడం లేదని, గత ప్రభుత్వ హయాంలో తాము 14వ ఆర్థిక సంఘం నిధులను ప్రతి గ్రామంలోని ఎంపిటిసిలకు గ్రామ అభివృద్ధి కోసం సమకూర్చామని, కానీ ఇప్పుడు కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం వైసిపి తరఫున గెలిచిన తమకు ఏ విషయాలు తెలియజేయకుండా, నిధులు పుష్కలంగా ఉన్నా కూడా గ్రామ అభివృద్ధికి ఆ నిధులను ఖర్చుపెట్టనీయకుండా తమపై కక్ష సాధింపు చర్యలకు దిగుతుందని తెలియజేశారు. పార్టీ రహితంగా 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి, తాము ఇచ్చిన తీర్మానానికి ప్రొసీడింగ్స్ ఇంతవరకు అమలు చేయలేదన్నారు. ప్రజా ప్రతినిధులుగా తమను ఎన్నుకున్న ప్రజలకు తాము న్యాయం చేయలేకపోతున్నామని ఈ పదవులు తమకు ఎందుకు అని, వాపోయారు. మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పార్టీ రహితంగా నిధులను అందరికీ సమానంగా సమకూర్చుతామని, వట్టి మాటలు చెప్పడమే తప్ప, ఆచరణలో సాధ్యం కాలేదని ప్రతిపక్ష ముఖంగా వాపోయారు. అదే విషయంపై ఎంపిడిఒ ప్రసన్నకుమారిని వివరణ కోరగా... మరో రెండు రోజుల్లో ఎంపిటి రాసిన తీర్మానం ప్రకారం ప్రొసీడింగ్ ఇస్తామని చెప్పినా వారు వినకుండా మీటింగ్‌ను మధ్యలో బాయ్‌కాట్ చేసి, కోరం ఉన్నా కూడా వైసిపికి సంబంధించిన ప్రజాప్రతినిధులు బయటకు వెళ్లిపోయారని తెలియజేశారు. కార్యక్రమంలో మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

క్వారీ లీజుపై గ్రామసభ

- అప్లికేషన్ వెంటనే రద్దు చేయాలని సింగారెడ్డిపల్లి గ్రామస్తులు

ప్రజాశక్తి-సీతారామపురం

మండలంలోని సింగారెడ్డిపల్లి గ్రామ పంచాయతీలో సర్వేనెంబర్ 169లో ఉన్న భూమిని 20యేళ్ల వరకు ఇండోసోలార్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీకి క్వారీలీజు మంజూరు కోసం కంపెనీ ప్రతినిధులతో కలిసి మంగళవారం ఆత్మకూరు ఆర్‌డిఒ పావని గ్రామసభ నిర్వహించారు. కొందరు గ్రామస్తులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ తాము దీనిని అంగీకరించమని, వెంటనే రద్దు చేయాలని ఆర్‌డిఒను కోరారు. క్వారీకి తాము అంగీకరిస్తే తమకు చాలా నష్టమని తెలియజేశారు. తమకు ఆధారమని మేకలకు, బర్రెలకు, జీవాలకు కాబట్టి ఎంతో ఇబ్బంది పడతామని అక్కడి నుంచి వచ్చే దుమ్ము వల్ల తమకు చాలా ఇబ్బంది ఎదుర్కొంటామన్నారు. క్వారీకి దగ్గరలోనే ఇల్లు ఉన్నాయి కాబట్టి ఎట్టి పరిస్థితుల్లోనూ తాము ఎవ్వరమూ కూడా ఒప్పుకొనే ప్రసక్తే లేదన్నారు. తాము మాత్రం ఎటువంటి పరిస్థితుల్లో కూడా తమకు ఆ క్వారీ వద్దే వద్దని చెప్పేశామన్నారు. గ్రామసభలో కేశవ, చంద్రమౌళి, తిరుపాలు, పానెం రమణయ్య, శేఖర్, వెంకటేష్, సుధీర్, బాల ఓబయ్య, ఇబ్రహీం, ఎంపిడిఒ భాస్కర్, తహశీల్దారు పివి. కృష్ణారెడ్డి, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

చెరువు భూములతో వ్యాపారాలు చేస్తే సహించం..

ప్రజాశక్తి-బిట్రగుంట


సర్వే చేస్తున్న అధికారులు

రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు చెరువు భూములతో వ్యాపారాలు చేస్తే సహించమని దళిత సంరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ బోగోలు మండలం కోవూరుపల్లి చెరువు పక్కన రియల్ ఎస్టేట్ వ్యాపారస్థులు చాలా మంది చెరువు భూములు ఆక్రమించుకొని వ్యాపారాలు చేస్తున్నారని తెలిపారు. కోవూరుపల్లి చెరువు పక్కన 335, 333 సర్వే నెంబర్ రోడ్డు పక్కన వారికి ఇచ్చిన స్థలం 12 ఎకరాలు అయితే దానిని 50ఎకరాలు చేసి చెరువు మధ్యన గోడలు కట్టి లేఅవుట్లను వేసుకున్నాడని తెలిపారు. చెరువు ఆక్రమణ విషయం పత్రికలలో కూడా వచ్చిందన్నారు. దాని మూలంగా ఎకరా, రెండు ఎకరాలు మాత్రమే తొలగించినట్లు తెలిపారు. చెరువు ఆక్రమణలను పూర్తిగా తొలగించాలని రాష్ట్ర లోకాయుక్తలో చైర్మన్ జస్టిస్ లక్ష్మరెడ్డి నాయకత్వంలో ఉన్న వారికి ఫిర్యాదు చేసినట్లు, దానిపై మంగళవారం రెవెన్యూ అధికారులు, మండల సర్వేయర్, సచివాలయ అధికారులు, సర్వే నెంబర్లలో కొలతలు తీసుకొని పరిశీలించారు. రెవెన్యూ అధికారులు బుధవారం కూడా సర్వే చేసి చెరువు భూములు అన్యాక్రాంతమైన భూములు ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని అధికారులు తెలిపారన్నారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకుడు ఇందుపూరు రాము, నాటకరాణి భాస్కర్, ప్రసాద్, రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

మార్కెట్ నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం


పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ సుప్రజ

మార్కెట్ కాంప్లెక్స్ పనులలో భాగంగా వ్యాపారాలను కొనసాగించేందుకు తాత్కాలిక రేకుల షెడ్లను నిర్మిస్తున్న పనులను నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా కమిషనర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బుచ్చిరెడ్డిపాలెం పట్టణం అభివృద్ధి పథంలో నడిచే భాగంలో నూతనంగా నిర్మిస్తున్న మార్కెట్ కాంప్లెక్స్ పనులను త్వరిగతిన పూర్తిచేయాలని కాంట్రాక్టర్లను ఆమె కోరారు. తమకు అండగా నిలిచినందుకు మార్కెట్ వ్యాపారస్తులందరూ చైర్‌పర్సన్‌కు ధన్యవాదాలు తెలిపారు.

భోజనం పథకంపై ఎంఇఒ విచారణ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఇఒ జ్యోతి

ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని ఎసిఎస్ఆర్ కాలనీలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం సరిగా లేదని ఫిర్యాదులు పత్రికల్లో వార్తలు వచ్చిన నేపథ్యంలో మంగళవారం డిఇఒ ఆదేశాల మేరకు ఎంఇఒ జ్యోతి విచారణ చేపట్టారు. మధ్యాహ్నం భోజనం సమయంలో పాఠశాలకు చేరుకొని పదార్థాలను రుచి చూశారు. విద్యార్థులు ఆమె స్వయంగా వడ్డించారు. విద్యార్థులను భోజన విషయమై ఎలాంటి భయం లేకుండా నిర్భయంగా చెప్పాలని కోరడంతో కొందరు తమ అనుభవాలను ఎంఇఒ దృష్టికి తీసుకొచ్చారు. హెచ్ఎం హజరత్తయ్య, ఉపాధ్యాయురాలు కె.సుజాతను ఎంఇఒ విచారణ చేశారు. పాఠశాల విద్యా కమిటీ సభ్యులను కొందరు విద్యార్థులు తల్లులతోనూ ఎంఇఒ జ్యోతి విడి విడిగా మాట్లాడారు. భోజన పథకం నిర్వాహకులకు నోటీసులు ఇచ్చినట్లు మరోసారి ఇలా జరగకుండా విద్యార్థులకు చక్కని భోజనం పెట్టాలని ఎంఇఒ హెచ్చరించినట్లు తెలిపారు. హెచ్ఎంకు మెమో ఇచ్చినట్లు వివరించారు. పూర్తిస్థాయి నివేదిక డిఇఒకు పంపినట్లు ఆమె తెలిపారు.

వేమన జయంతి వేడుకలు

ప్రజాశక్తి-కావలి


బహుమతులు అందజేస్తున్న దృశ్యం

స్థానిక రామమూర్తిపేటలోని 'కలయిక విజ్ఞాన కేంద్రం' ఆధ్వర్యంలో విజ్ఞాన కేంద్రం ప్రాంగణంలో వేమన జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సభకు కేంద్రం అడ్వైజర్ సి.శారద అధ్యక్షత వహించారు. ముందుగా వేమన చిత్రపటానికి ఎంఇఒ-1 గోవిందయ్య, ముఖ్య వక్తలుగా అన్నదాత మణి, నరేంద్రభారతి పూర్వపు తెలుగు పండితులు పి.జానకిరామ్, విజ్ఞానకేంద్రం ప్రధానబాధ్యులు ఎన్.సాయిరాం ప్రసాద్, కన్వీనర్లు ఇలీంద్ర లావణ్య, జి.రాంప్రసాద్ పుష్పాంజలి ఘటించారు. కావలి ఘంటశాల, ఎస్.రామచంద్రరావు మధురమైన ప్రార్థన గీతంతో సభ ప్రారంభమైంది. ఇలీంద్ర లావణ్య కలయిక విజ్ఞానకేంద్రం ప్రధాన ఉద్దేశాలు తెలియజేశారు. తదనంతరం ఎంఇఒ-1 బి.గోవిందయ్య, అన్నదాత మణి, జానకిరామ్ వేమన శతక పద్య - తాత్పర్య పోటీలో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో విజ్ఞాన వేదిక సభ్యులు జి.హరనాథ్, చవేరా చన్నా వెంకట్రామయ్య, కొల్లా మాధవరావు, నరసారెడ్డి, వెంకటేశ్వర్లు, లలిత, ఫాతిమా, నూర్జహాన్, తదితరులు పాల్గొన్నారు. మరిన్ని మంచి కార్యక్రమాలతో ముందుకొస్తామని కన్వీనర్ జి.రాంప్రసాద్ తెలియజేశారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-వరికుంటపాడు


చెక్కులు అందజేస్తున్న ఎంఎల్ఎ కాకర్ల సురేష్

వింజమూరు మండలంలోని బొమ్మ రాజుచెరువు ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎంఎల్ఎ కాకర్ల సురేష్ పంపిణీ చేశారు. వరికుంటపాడు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన కాలే వెంకట లక్ష్మమ్మకు రూ.50814 చెక్కును, వరికుంటపాడు గ్రామానికి చెందిన దాసరి ప్రసాద్‌కు రూ.90వేల చెక్కును ఎంఎల్ఎ అందజేశారు. ఎన్నో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వైద్యం కోసం ఇబ్బంది పడుతున్న తమకు ఎంఎల్ఎ ముందుండి నేను ఉన్నాను అని భరోసా ఇచ్చి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా కొంత నగదును చెక్కు రూపంలో ఇప్పించడం ఎంతో ఆనందంగా ఉందని లబ్ధిదారులు ఎంఎల్ఎకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ చంద్రా మధుసూదన్ రావు, జెడ్‌పిటిసి రావిళ్ళ నాగేంద్ర, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ పోకా మహేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ యాదవ్, మండల తెలుగు యువత అధ్యక్షులు లక్ష్మీనారాయణ, వరికుంటపాడు మాజీ ఉపసర్పంచ్ సుంకర రాధాకృష్ణ, నాయకులు ఆంద్రా శివరామిరెడ్డి, పొద మాధవరావు, తదితర నాయకులు ఉన్నారు.

సింగిల్‌రోడ్డు వేయడంపై ఆవేదన

ప్రజాశక్తి-ఎఎస్‌పేట



మండల హెడ్ క్వార్టర్ పరిధిలోని రోడ్డుపై ఆర్‌అండ్‌బి అధికారులు డబుల్ రోడ్డు ఉన్న ఈ ప్రాంతంలో తారువేసి సింగల్ రోడ్డుగా మార్చారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అదే విషయంపై ఆర్‌అండ్‌బి అధికారులకు ఫోన్‌లైన్‌లో సంప్రదించగా వారు స్పందిస్తూ కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం గుంతలు లేని ఆంధ్రప్రదేశ్ అనే పథకంలో భాగంగా రోడ్డుకు మధ్యలో ఉన్న గుంతలను పూడ్చే క్రమంలో ఆ గుంతలకే కాకుండా, కొంచెం ఎక్కువగా వేస్తే బాగుంటుందని ఉద్దేశంతో, కొంచెం ఎక్కువ పరిమాణంలో రోడ్డు వెడల్పుగా వేశామని, అక్కడ ఎలాంటి సింగిల్ రోడ్డుగా వేయడం లేదని, ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావాల్సిన అవసరం లేదని చెప్పారన్నారు. అదేవిధంగా నక్కల వాగులో బ్రిడ్జిపై కొంచెం గుంటలు ఉంటే అక్కడ నామమాత్రపు కొంచెం కంకర, కారు వేసి ఆ గుంతలను పూడ్చామే తప్ప, అక్కడ తిరిగే వాహనాలకు ఇబ్బందిగా ఉన్న కారణంగా, ఆ ఇబ్బందిని తొలగించడానికి మాత్రమే చేశామని సవివరంగా తెలియజేశారన్నారు.

'శ్రీ సాయి' స్కూల్లో పేరెంట్ మీటింగ్

ప్రజాశక్తి-జలదంకి : శ్రీ సాయి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో మంగళవారం కరస్పాండెంట్ అయ్యలరెడ్డి తల్లి దండ్రుల తో విద్యా సదస్సు ఏర్పాటు చేశారు. 2024-25 విద్యా సంవత్సరంలో శ్రీ సాయి స్కూల్‌లో జరిగిన విద్యా సంబంధిత, విద్యాపకేతర కార్యక్రమాలు వివరించారు. అధ్యాపకులందరినీ తల్లిదండ్రులకు పరిచయం చేసి వారివారి సబ్జెక్ట్స్ నైపుణ్యాన్ని తెలియజేశారు.

దోమల నియంత్రణకు చర్యలు

ప్రజశక్తి-కావలి

కావలి పట్టణ పరిధిలోని వార్డు నెంబర్లు 5, 6, 12, 13, 14లలో అందలి పరిసర ప్రాంతాలలో ప్రస్తుత పరిస్థితులలో ప్రజలకు దోమల బెడద నియంత్రణ కోసం కావలి పురపాలక సంఘ పారిశుధ్య విభాగం వారు కాలువల్లో స్ప్రేయింగ్ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా వార్డు నెంబర్ 16, 33, 28 వార్డులలో గ్యాంగ్ వర్కు చేసినట్లు వెల్లడించారు.

'గీతాంజలి'లో స్వచ్ఛ సర్వేక్షణ్



ప్రజాశక్తి-కోవూరు : గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమాన్ని గంగవరం గ్రామంలో విద్యార్థులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సందీప్‌కుమార్ మాట్లాడుతూ గ్రామస్తులు కూడా చెత్తాచెదారాలను తమ ఇష్టానుసారంగా ఎక్కడంటే అక్కడ పడవేయకుండా పంచాయతీ ఏర్పాటు చేసిన చెత్త కుండీలను ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రవణ్ కుమార్ రెడ్డి, ఎన్ఎస్-ఎస్ కోఆర్డినేటర్ మురళీకృష్ణ, క్యాంపస్ మేనేజర్ సుధాకర్రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

అక్షరాస్యతపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-సీతారామపురం

మండల కేంద్రంలోని ఎల్‌విఆర్ జూనియర్ కళాశాలలో ఆర్థిక, అక్షరాస్యతపై అవగాహన మనీస్కామ్స్ గురించి మంగళవారం ఎస్ఎస్‌టి ఎన్‌జిఒ వారు సదస్సు నిర్వహించారు. అవగాహన కార్యక్రమంలో కౌన్సిలర్ రామ్మోహన్, హరీష్, శశి కుమార్, బ్యాంకు మేనేజర్ జస్వంత్, ప్రిన్సిపల్ శ్రీనివాసులు, ఉమశంకర్, ఉపాధ్యాయ సిబ్బంది, బ్యాంకు సిబ్బంది, పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు శిక్షణ కార్యక్రమాలు



ప్రజాశక్తి-కావలి

స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు రెండ్రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఎంఇఒ-1 గోవిందయ్య జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అంగన్‌వాడీ కేంద్రాలలోని చిన్నారులకు నేర్పాల్సిన పి.పి.-1, పి.పి.-2 విద్యాబోధన పద్ధతులను ఈ శిక్షణా కేంద్రంలో బోధించారు. నూతన విద్యా పద్ధతులను, పూర్వ ప్రాథమిక విద్యను గురించి తెలియజేశారు. మేధాభివృద్ధి కోసం,ఈ కాలంలో సానుకూల పద్ధతులలో ఎలా అభివృద్ధి చెందాలో వివరించారు. ఈ సందర్భంగా ఎంఇఒ గోవిందయ్య, కావలి సి.డి.పి.ఓ. కె.సౌజన్య, జిల్లా పరిషత్ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, డిఆర్‌పిలుగా ఉన్న ఉపాధ్యాయులు ,ఐ.సి.డి.ఎస్. సూపెర్వైజర్లు ట్యూటర్లుగా పాల్గొని బోధించారు. కార్యక్రమంలో కె.ఆర్.పి.గా నరసయ్య పాల్గొని ఆకస్మిక తనిఖీ చేశారు. శిక్షణలో అంగన్‌వాడీ కార్యకర్తలు తమ కేంద్రాలను మరింతగా తయారు చేయడానికి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.డి.పి.ఓ. కె.సౌజన్య మాట్లాడుతూ 22, 23 తేదీలలో, 23, 24 తేదీలలో, 25, 26 తేదీలలో 3 బ్యాచ్‌లుగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : 0 నుంచి 6 సంవత్సరాల చిన్నారులు, గర్భిణులు మానసిక, శారీరక అభివృద్ధి పెంపొందించే విధంగా ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశమని కోర్సు డైరెక్టర్ తోట శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీలకు ఆరు రోజులపాటు జరుగు శిక్షణ కార్యక్రమాలు మొదటి రోజు ప్రారంభమయ్యాయి. అంగన్‌వాడీలకు ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విధానాలు పలుఅంశాలపై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం బాలకేశవులు, రిసోర్స్‌పర్సన్లు, సూపర్‌వైజర్ తేజస్విని, సుబ్బారెడ్డి, ఫణిరాజా, సారథి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సీతారామపురం : ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని అంగన్‌వాడీ టీచర్స్‌కు మంగళవారం చేపట్టిన శిక్షణ కార్యక్రమంలో మొత్తంమీద 41మంది అంగన్‌వాడీ టీచర్స్ పాల్గొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం అంగన్‌వాడీ డిపార్ట్మెంట్, ఐసిడిఎస్ డిపార్ట్మెంట్, పర్యవేక్షణలో జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ మస్తాన్ వలీ, హెచ్ఎం శ్రీనివాసులు, సిడిపిఒ ఉపాధ్యాయులు రవి, మహేష్, వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



ఎమ్‌డియు డ్రైవర్లకు సూచనలు

ప్రజాశక్తి-కోవూరు

కోవూరులోని తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించిన డీలర్లు, ఎండియు డ్రైవర్లతో తహశీల్దారు నిర్మలానందబాబా ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ కొంతమంది ఎండియు వాహన డ్రైవర్లు కార్డుదారుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, వారిపై చులకనభావం చూపడం మంచి పద్ధతి కాదన్నారు. ప్రధానంగా ప్రభుత్వం నిర్దేశించిన వేళలు పాటిస్తూ సకాలంలో కార్డుదారులకు సరుకులు పంపిణీ చేయాలన్నారు. ఏ వాహన డ్రైవర్పై గానీ నిర్దిష్టమైన ఫిర్యాదు వస్తే దానిని పరిశీలించి ఆ డ్రైవర్‌పై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా సిఎస్‌డిటి బాలకోటమ్మ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ రవి, సీనియర్ అసిస్టెంట్ కిరణ్, రేషన్ డీలర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి, డీలర్లు ఉన్నారు.

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-బిట్రగుంట


మాట్లాడుతున్న ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డి

శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగే బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఎంఎల్ఎ కావ్య కృష్ణారెడ్డి పేర్కొన్నారు. కొండ బిట్రగుంట ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలపై అన్నిశాఖల అధికారులతో మంగళవారం ఆలయ ప్రాంగణంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ మార్చి 9వ తేదీ నుంచి 15వ తేదీ వరకు శ్రీవారి బ్రహ్మోత్సవాలు నిర్వహణకు సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. శ్రీవారి బ్రహ్మత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుండి భక్తులు విశేషంగా హాజర వుతారని, అందుకు తగ్గట్లుగా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను కోరారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. శానిటేషన్ సిబ్బందిని మూడు షిఫ్టుల్లో ఏర్పాటు చేయాలన్నారు. నిరంతర విద్యుత్ ప్రసారానికి చర్యలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎం.సన్నీ వంశీ క్రిష్ణ, డిఎస్‌పి పి.శ్రీధర్, కావలి మున్సిపల్ కమిషనర్ శ్రావణ్, ఆలయ ఇఒ రాధాకృష్ణ, మాజీ చైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి, తహశీల్దార్ సురేష్ బాబు, ఎంపిడిఒ సుబ్రమణ్యం, మండల టిడిపి అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు, రావి విజయ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.